# ★ దేవీపూజ

శ్రీ "గంపిరామ్"

విజయ దశమి ..

ఏదో కొత్త సినిమా ఆట ఆగంధులోచాలా మంది నిలబడ్డారు ఆ హిందీసినిమా చూడటానికి వెళ్ళాలని

హిందీ రానివాళుకూడా ఆ హిందీసినీమా కథ చాలాబావుందని మెచ్చుకుంటున్నారు. అంటే స్త్రీ పురుష సంబంధాలూ ప్రేమా సెక్సులాంటి ప్రపంచంకన్నా పాతబడిపోయిన ప్రశ్నలూ. వక్షోజ ప్రదర్శనం అర్థంలేని అర్థదిగంబర విదేశీ నృత్యం. ఇంకా ఇట్లాంటివే కళా విహీనమైన, అమానుషమైన చౌకబారుదృశ్యాలూ ఆసినిమాలో గట్లు తెగగొట్టుకోని ప్రవహిస్తున్నాయన్న మాట!

దేయాంముఖాన్ని జ్ఞప్తిచేసేటంత అందవికామైన నవ్వుతో తనలోని యవ్వనశోభ నంతటినీ, కొల్లబోస్తున్న ఒక నటీమణి బొమ్మ ఒకగోడ మీదనుంచి నాట్యం పేరిట చెలామణీ అవుతున్న మొగ్గలను వేస్తున్న నటీమణి బొమ్మమరొక గోడమీదనుంచీ రోడ్డుమీదనుంచి ఒచ్చేపోయే వాళ్ళను అతిసీరియస్‌గా చూస్తున్నాయి.

ప్రభుతం ఇట్లాంటి కళావిహీనమైన బొమ్మలను అట్లు పబ్లిక్‌గా ఎందుకు ప్రదర్శించనిస్తారో!

అయితే ప్రజలలోని కళాచైతన్యాన్ని పునరుద్దీపింపజేసి తీర్చిదిద్దవలసిన బాధ్యత తమదేనని గ్రహించ గలిగితేనూ కళఅంటే యేమిటో ప్రభుత్వానికి బోధ పడుతేనూ అది ప్రభుత్వం ముఖ్యంగా ప్రజాప్రభుత్వంకానేకాదు!!

దేవీపూజ చూడటానికి ఆలయానికి వెళ్తూ పందుకొసనున్న కిల్లీలకొట్టుమీన కిల్లీలూ సిగరెట్లూ కొందామని నిలబడ్డాను.

ఎందుకో తెలియకుండా పరాకుగా వెనుకకు తిరిగి చూసాను

సందు మలుపులోంచి బొంబాయిఅంచు తెల్ల కుచ్చిళ్లు అతివేగంగాకుండా అతిమందంగాకుండా షాషన్‌కు ఫేషనూ వయ్యారానికి వయ్యారమూ చెడకుండా వస్తుంటే ప్రత్యేకమైన భావం యేదీ లేకుండా పరాకుగా ఆకుచ్చిళ్ళలోని ఎర్రఅంచును చూస్తూనిలబడ్డాను.

తెల్లటి పాదాలను పట్టిన ఎర్రటి జోడుపట్టీలు వాటిమీద తెల్లటి కుచ్చిళ్ళలోని ఎర్రఅంచు జీరాడుతుంటే—ఏదో అవ్యక్తమైన అందం కనబడ్డాది అదృశ్యంలో.

కొట్టుమీద అబ్బాయిని రెండు కారాకిల్లీలు, సిగరెట్టుపెట్టే యిమ్మని మళ్ళీ నేను వెనక తిరిగి చూసే సరికి తెల్లకుచ్చిళ్లు ఎలక్ట్రిక్ లైటుసీడలోకి డిజైనూనూ జాకట్టు ఎర్ర ఎంబ్రాయిడరీ పెద్ద లోలాకులూ మాత్రమే కనబడుతున్నాయి.

కొట్టుమీద అబ్బాయి కిల్లీలూ- సిగరెట్టుపెట్టి నాచేతి కందిస్తూ ఒక్కదృష్టిలో నన్నూ తెల్ల కుచ్చిళ్ళనూ పరీక్షగా చూసాడు.

"సరి కొత్తసరుకు చాలా తాజాగా ఉంటుందండి" అన్నాడు నవ్వకుండా.

నేను సిగరెట్ పెట్టెమార్కుచూసాను. సరిగా కనపడకపోతే కొద్దగావంగి ఎలక్ట్రిక్ లైటు క్రింద పెట్టి చూసాను మామ్మూలు కత్తిరమార్కు సిగరెట్టు పెట్టే!

"మామ్మూలు మార్కేనోయ్" అన్నాను

మామ్మూలు కత్తిరమార్కు అయినా సరుకు తాజాదిబాబూ" అన్నాడు చిరునవ్వుతో. పదిగజాల దూరంలో హొందాతో ముందుకుకారుకు పోతున్న తెల్ల కుచ్చిళ్ళ ప్రక్కదృష్టి తిప్పుతూ.

పార్కులోని పుష్పాలను దొంగతనంగా కోసు కొని పోతున్న ఎవరో అబ్బాయిమీద పార్కు తోటమాలి కేకలు వేస్తున్నాడు

"పార్కులోని పువ్వుల మీద చెయ్యి వెయ్య కూడదు" అని అంటున్నాడు.

అక్కడ అయిదు ఆరుగురు గుంపుగా చేరారు తెల్లకుచ్చిళ్లు వాళ్ళప్రక్క చూస్తూ తాపీగా వెళ్తున్నాది.

ఒక పెద్దమనిషి తన ప్రక్కనున్న స్నేహితునితో అంటున్నాడు—"పార్కులో పువ్వులు ప్రతీవాళ్ళూచూసి ఆనందించడానికే! అక్కడ వున్నంత సేపూ వాటివాసన అందరూ పీల్చవచ్చు. ఆనందించవచ్చు"—అని.

ఆ స్నేహితుడు: "నిజమే! ఇంటికి పట్టుకొని పోతే ఎట్లా?'' అని.

మరొక ఆయన నవ్వుతూ అన్నాడు—"పార్కులో పువ్వులను కోసి ఇంటికి పట్టుకెళ్తే,వాటి సువాసన తగ్గిపోతుందా?"

పార్కులో రేడియో "ప్రియామిలన్ కో జానా" పాడుతూన్నది.

నేను సిగరెట్టు ముట్టించి నా పీడను నాప్రక్కనే నడిపించుకుంటూ బయలుదేరాను.

* * *

చలి తీవ్రంగానే ఉంది.

హైరోడ్డు మలుపు తిరిగే సరికి అనంతజీవిత పథం యొక్క ఛాయలాగ బ్రిడ్జి కనపడ్డాది.

ప్రపంచాన్ని ముంచెత్తివేస్తున్న నిశ్శబ్దంలోకి జారిపోతూ గుడ్డివెన్నెల ఆ బ్రిడ్జిని పలుకరిస్తున్నాది. చైతన్య విహీనంగా వాసనలేకుండా మనస్సును పట్టుకొని వ్రేలాడే పాతజీవితపు గాధలలాగ దారికి యిటూ అటూ కొంపలూ గుడిసలూ నిలబడి ఉన్నాయి

ఆ వెన్నెట్లో నేనూ నాకంటే ముందు నాపీడా అంతకంటే ముందు ఇరవైముప్పై గజాల దూరంలో తెల్లకుచ్చిళ్లూ.

నగంగా ప్రవహిస్తున్న నది ఎక్కడో ఎందుకో కుమిలి కుమిలి దుఃఖిస్తున్న అప్సరసకన్యను జ్ఞాపకం చేస్తున్నాది. ఆ కన్నీటి బిందువులను దూరంగా నిలబడి జాలిగాలెక్కిస్తున్న సాక్షులలాగ అవలగట్టుమీద చెట్లు నిలబడ్డాయి.

నా పీడను చరచరా ముందుకు నడిపించాను.

పహుశః దీపపూజ ప్రారంభించి ఉంటారు.

ఎంతచిన్నపనికైనా సరే ఎంతపెద్దపనికైనా సరే లేటు అవటం అలవాటు అయినట్టుంది నాకు, స్కూలుకు ప్రతిరోజూ రెండుపూటలా లేటు సినీమాకు లేటు రేడియో వార్తలు వినడానికి లేటు, రైలుకు లేటు.

ఆఖరికి దేవాలయానికీ సహా!

దీపపూజలూ లలితా సహస్ర నామాలూ పార్కులో పుష్పాలూ "ప్రియా మిలన్ కు జానా" పాటా ఇన్నీ నామస్తిష్కంలో నా ఆజ్ఞలేకుండా షికారు చేస్తున్నాయి.

సిగరెట్టుపొగ హెచ్చు పీల్చాను కాబోలు దగ్గొచ్చింది. కొద్దిదూరంలో తెల్లకుచ్చిళ్లు ఆగిపోయాయి. ఆమెకొద్దిగా వెనుతిరిగి చూచిందేమోఅని నా అనుమానం!

లేక నాఆజ్ఞలేకుండానే నా బుర్రలో షికారు చేస్తున్న "ప్రియామిలన్ కే జానా" పార్కులో పార్కులో పుష్పాలూ కలిసి నాకట్లాంటి అనుమానాన్ని కలుగ జేశాయి కాబోలు!

తెల్లకుచ్చిళ్లు బ్రిడ్జిగట్టుదగ్గరకు వెళ్ళి దానిమీద మోచేతులు ఆనుకొని అరచేతులలో చుబుకం పెట్టుకొని ప్రవాహవేగం కనిబెట్టడమే తనజీవిత సమావధిఅన్నంత తీక్షణతతో పరిపరీక్షిస్తున్నాది.

తలలోవున్న యెర్ర చంద్రకాంత పువ్వులు భుజాలమీద యెర్ర ఎంబ్రాయిడరీని చూసి సగర్వంగా నవ్వుతున్నాయి. ఆ పెద్దలోలాకులలోని యెర్ర రాళ్లుకూడా ఆ నవ్వుకు తమ మందహాసంతో శృతి కలుపుకొంటున్నాయి.

"అక్కయ్యా'' అని యెవరో పిలిచేరు.

ఎవరా అని నేను తలయెత్తి చూసాను. తెల్ల కుచ్చిళ్ళకు ఇరవైగజాల దూరంలో ముందుగా జీవితభారం దింపేసిన వ్యక్తిలాగ కులాసాగా తేలికగా నిర్లిప్తతతో ముందుకు అడుగువేస్తున్న ఒక చిన్న అమ్మాయి కనబడ్డాది. ఆమెపిలచి నేను తిరిగి తెల్లకుచ్చిళ్ళ దగ్గరకు వచ్చేవరకూ ఆమె ముందు ఉన్నాదన్నసంగతే చూడలేదునేను.

నేను వాళ్ళను దాటుకొని వెళ్ళిపోవాలని గబ గబా అడుగులు వేసుకుంటూ వెళ్తూ ఆమెకు కొద్దిదూరంలోకివచ్చాక ఏ ప్రత్యేకభావం లేకుం డానే పరాకుగా పరీక్షగా ఆమెవైపుచూసాను.

తల్లిపక్కలో పడుకొని కిలకిలా నవ్వుతున్న పసిపాపలాగ యేరూ—ప్లేటానిక్ ప్రేమికులలాగ ఎప్పుడూ ఒకరినొకరు అంటకుండా రీవిగా, విల బడ్డ కొండలూ. ప్రియురాలి హాసంలోని హాయిని జ్ఞాకంచేసే వెన్నెలా, దూరంగావున్న తోటల మధ్య పిల్లగాలులు శృతిలేకుండా పాడుతున్న అనంతగీతాన్ని వింటున్నాయి!

తనదగ్గరకు వచ్చిన చెల్లెలిచెవులో ఏదోమాట చెప్పడానికి కొద్దిగా వంగింది తెల్లకుచ్చిళ్లు.

ప్రక్కబారుగా రోడ్డుమీద వ్యాపిస్తున్న ఆమె నీడ, ఆ గుడ్డివెన్నెల్లో తలవంచి తనపక్కనుంచి చరచరా ముందుకుపోతున్న నానీడ తలలోనూ, గుండెలలోనూ, కలిసిపోయింది

ఆలయ విలయ దృశ్యం, సంశ్లేషణ విశ్లేషణ దృశ్యం, ఒక క్షణమాత్రం నా హృదయంలో ఏదో ఒకఅవ్యక్త పవిత్రభావాన్నీ అవిశ్చితఆశ్చర్య రాగాన్నీ, భాషలో పేరులేని ఒకవిశ్వాంగాన్నీ— అర్థంలేని సున్నితమైన భయాన్నీ ఒక్క సారిగా కలుగజేసింది.

నేను త్వరత్వరగా అడుగులువేస్తూ ముందుకు వెళ్ళిపోయాను.

ఆచిన్నపిల్ల పరుగెత్తుకుంటూ నావైపువచ్చింది దగ్గరగా వచ్చాక వేగంతగ్గించి "మేష్టారూ'' అని పిలిచింది.

నన్ను కాదమకున్నాను మొదట!

అయితే బ్రిడ్జిమీదనే కాదుకదా. చుట్టుప్రక్కల ఒక అరమైలు రేడియస్‌లో మేష్టారేకాదు, ఒక్క నరపురుగయినా లేరే!

నన్నే అయివుండాలి!

మరే ఆలోచనా లేకుండా వెనుదిరిగి చూసాను మెల్లిమెల్లిగా అడుగులు ముందుకువేస్తూ!

ఆ అమ్మాయి నాదగ్గరకు వచ్చి, నాపక్కనే నడుస్తూ అన్నాది—"మేముకూడా వస్తున్నా మండీ" అని.

ఆపిల్ల పరుగువల్ల కాబోలు. ఊపిరి చాలా వేగంగా తీస్తున్నాది.

ఆమె చెప్పినమాటలు నాకు బోధపడలేదు- వాళ్లురావడానికి నాతో చెప్పటం ఎందుకూ! లోకంలో యిన్నికోట్లమంది ప్రజలున్నారు. కొన్ని వేలమంది కాకపోయినా, కొన్ని వందలమంది అయినా దేవీపూజలకు వెళ్లి ఉంటారేమరి నా తోటే చెప్పటం ఎందుకు?

నేనెవరినని అనుకుంటున్నారో? అదీకాక నేను ఎక్కడికి వెళ్తున్నా ననుకున్నారో?

ఇంతలో తెల్లకుచ్చిళ్లు దగ్గరగావచ్చి విల బడ్డాది.

నాకుతెలీకుండా ఆమె నీడ ప్రక్క చూసాను.

నానీడ పక్కనే ఆమెనీడ ఉన్నాది: "నిజానికి ఆమె నాభుజాలవరకే పొడుగు ఉన్నా. ఆమెనీడ మాత్రం ఎందుచేతనో నానీడకన్నా పొడుగుగా ఉన్నాది!

ఆమె నా ప్రక్క చాలామృదువుగా చూస్తు న్నాది ఆచూపులలో. సిగ్గూ, లజ్జా, ప్రత్యేకంగా స్త్రీ సహజమైన యేభావమూ లేవు- ఒకవ్యక్తి మరోవ్యక్తిని చూస్తున్నట్లు మాత్రమే చూస్తు న్నాది.

ఆమెవైపు ప్రశ్నిస్తూ చూసాను:

ఒక్కక్షణం అయాక ఆమె మెల్లిగా ప్రశ్నిం చింది "ఆలయానికేనా అండి" అని.

మరొకక్షణం ఆగి, నా జవాబు వినకుండానే అంది—"మేముకూడా ఆలయానికే బయలు దేరాము"

తెల్లకుచ్చిళ్ల చెల్లెలు అక్కచేతిని తన రెండు చేతులతోటీ పట్టుకోపి, వేళ్ళతో ఆడుకుంటూ .. కొద్దిగా నావైపువంగి, ఏదోరహస్యం చెప్తున్నట్లు అంది "మీరు మాకు సహాయం—"

అమాటచెపుతే ఆపిల్లకళ్లు పెంకితనంతో కాబోలు మిలమిల మెరిశాయ్।

అయితే, వీళ్ళూ ఆలయానికే అన్నమాట!

ఈయిద్దరు అమ్మాయిలూ నాకు తెలియక పోయినా వాళ్ళకునేను తెలిసి ఉంటాను! బహుశః వాళ్లని మరిచిపోయాను కాబోలు। తరుచు మనుష్యుల ముఖాల్ని. పేర్లనీ మరచిపోటం. ఒకరిని చూసి ఇంకొకరను కోపటం మామూలే నాకు!।

నేను మరేమీ మాట్లాడకుండా ముందుకు అడుగువేశాను నాప్రక్కనే అక్కచెల్లెళ్లిద్దరూ చెట్టాపట్టాలు వేసుకొని నడుస్తున్నారు.

రెండడుగులు వేసాక ఆమెవైపు పరీక్షగా చూశాను. ఇంతవరకూ ఆమెలో వ్యక్తిగతంగా కనపడ్డ అందం ఇప్పుడు ఒక సెట్టింగ్‌లో కనబడ్డాది.

సన్నంగా, పొడుగ్గా, ఉన్నా అందంగా ఉంది· కోలటిముఖం, పెద్దకళ్లకు సన్నని కాటుకా, చిన్నబొట్టు. ఎర్ర ఎంబ్రాయిడరీతో జాకెట్టు. తెల్లటి చీరా. అన్నీకలిసి పెమికిన్ సౌందర్యాన్ని జ్ఞప్తి చేస్తున్నాయి.

నేను చూపు మళ్ళించినప్పుడల్లా ఆమెకూడా నాప్రక్క చూస్తున్నది.

ఆమెను నేనెక్కడో చూశాను. ఎక్కడో— యేమిటో జ్ఞాపకం రావటంలేదు: అడగటానికి యేప్రశ్నా లేదు.

చీకట్లో అడుగువేసినట్టు సంకోచిస్తూనే అడిగాను "మీరు మాప్రక్కయింట్లో ఉన్నారుకాదూ'

"ఉఁహుఁ, మీరున్న సందుకొస యింటో ఉన్నామండీ' అని చెల్లెలుచెప్పింది. ఏదో దగ్గర సంబంధాన్ని జ్ఞాపకం చేస్తున్నట్టు చూసింది.

'ఉఁహుఁ' అన్నాను.

నిశ్శబ్దంగా కొన్నిగజాలు వెళ్లేము.

ఆవెన్నెల చల్లదనంలో, ఆప్రగాఢ నిశ్శబ్దంలో ఆమె నాప్రక్క తీక్షణంగా. పరీక్షగా చూడటం భరించ శక్యంకాకుండా ఉంది. మేటర్‌లింక్ చెప్పినట్లుగా నిశ్శబ్దంలో ఆత్మలు మాట్లాడుకుంటాయి వ్యక్తుల,అధ్యాత్మిక భావనాశక్తి ప్రకోపిస్తుంది— ఆమె నాఆత్మను చదివివేస్తే దానిలోని రహస్యాలను చూడగలుగుతే చాలాప్రమాదోలు ఉన్నాయి।

అందుచేతనే ఎవరో మహాయోగులు తప్ప తక్కన యింకెవరూ నిశ్శబ్దాన్ని భరించలేరు!

ఆ నిశ్శబ్దాన్ని తీసివెయ్యడానికి నేనే యేదైనా ప్రశ్నించాలి. నాప్రక్కనే నడవటం చాలా కీర్తిధాయకం అన్నట్టుగా నిశ్శబ్దంగా వాళ్ళిద్దరూనడిచివేస్తున్నారు. బహుశః ఏదోభాషలో కళ్లతో మాట్లాడు కుంటున్నామోనని నా అనుమానం.

ఆ చిన్నపిల్లను అడిగాను "ఏమిటమ్మా నీ పేరు?"

ఆపిల్ల తెల్లకుచ్చిళ్ల ప్రక్క చూసింది: చెప్పమన్నావా అని ప్రశ్నిస్తున్నట్టు.

ఆమె మృదువుగా చెప్పింది: మా చెల్లిపేరు సరోజ.

ఒక్కక్షణం ఆగి, నాప్రక్క చూస్తూ మరలా అంది—నాపేరు కమల.

ఆ కొసయింట్లో యెవరున్నారో జ్ఞాపకంతెచ్చుకోడానకి ప్రయత్నం ఆరంభించాను.

ఎవరో కలక్టర్ ఆఫీస్‌లో గుమస్తాకాబోలు, అందులో ఈమధ్యనే దిగారు. ఆయనకు రెండో వివాహంకూడా అయిందని యెక్కడో విన్నాను; అంటే వీళ్ళిద్దరూ మొదటిభార్య పిల్లలు కాబోలు!

మీనాన్నగారు కలక్టర్ ఆఫీసులో పనిచేస్తున్నారు కాదూ? అని ప్రశ్నించాను.

ఇద్దరూ తలవంచుకోని అడుగులను లెక్కిస్తున్నట్టుగా నడుస్తున్నారు: యీప్రశ్న అడగగానే యిద్దరూ ఒక్కసారి తలలెత్తి నావేపు చూసారు।

నేను అడిగినప్రశ్నకు పరీక్షిస్తున్నట్లు కొన్ని క్షణాలు ఆగారు; తర్వాత సరోజ అడిగింది. మా నాన్నగారా అండి?

అవును! ఆయన కలక్టర్ ఆఫీసులో కాదూ పనిచేస్తున్నారు? అని తిరిగి ప్రశ్నించాను

సరోజ నవ్వుతూ తడుముకోకుండా అన్నాది వాళ్ల అక్కవైపు చూస్తూ మానాన్నగారు లేరండి?

ఆ కలక్టర్ ఆఫీసుగుమస్తా ప్రథమ కళత్రం పిల్లలు కారన్నమాట!

సర్దుకుంటూ ప్రశ్నించాను మీరు యీకొాస నున్న యింట్లో ఉన్నారు కాదూ?

ఆ పిల్లకు "యీకొాస'' అంటే ఏమిటో బోధ పడలేదు, అందుచేత "అవునండి'' అంది.

ఈ కొంచెం వ్యవధిలోనూ యీకొాస యింట్లో నివసిస్తున్న వారెవరో జ్ఞాపకం తెచ్చుకుంటున్నాను, యెవరో ముసలమ్మ కాబోలు ఉన్నాది. అయితే ఆవిడ పిల్లలే కాదు ఆ రక్తఛాయలున్న వాళ్ళయినా యింతఫాషన్ బూల్‌గా ఉంటారా?

నా మేష్టర్ ఉద్యోగం వెలిగించటం ప్రారంభించాను.

"మీ యింటి పేరేమిటి అమ్మా ? ''

చెల్లి నవ్వుతూ చెప్పింది నాగుండె ఒకటి రెండు క్షణాలు ఆగి పోయింది.

ఓయ్ భగవంతుడా! వీళ్ళు సాని పిల్లలు కాబోలు కాకపోతే ఆ యింటిపేరు అట్లావుండదే

కమల వ్యంగ్యంగా చిరునవ్వు నవ్వుతూ నా ప్రక్కచూసింది. నా ఆలోచనలను చదివి జవాబు చెప్పినట్టుగా అన్నాది, "చిన్ని వెన్నెల కందు వెన్నుదన్ని సుధాబ్ధి బుట్టిన చెలువ తోబుట్టు మాకు'' అని.

బాగా చదువుకున్న అమ్మాయిలాగే ఉంది. చక్కగానే ధ్వనించింది కూడా.

ఈ అమ్మాయికి కావ్యాలన్నీ కంఠస్థంకాబోలు కొంపతీసి! జేబున్నీసా కాబోలు తన ప్రియుడితో పద్యాలలో ధ్వనిస్తూ మాట్లేడేదిట!

అసలు ఈ రోజులలో అమ్మాయిలకి యిదో దురలవాటు—కవుల రచనలలోంచి వాక్యాలను తీసి ఉపయోగించటం! అందుకే వాళ్ళని వివాహం చేసుకో డానికి భయపడతారు!

వీళ్లు మా సందులో యెక్కడ వున్నారో—? పూర్వం ఊళ్లో వీళ్ళకు ప్రత్యేకం ఒకవీధి, ఒక స్థానం, సంఘంలో ఒకస్థానం వుండేవి ప్రజా ప్రభుత్వం వచ్చేక వీలు అయిన స్థానాన్నీ ఆక్రమించుకోని కార్మికులలో ఒకభాగం అయి కూర్చున్నార్! బహుశః వీళ్ళుకూడా [ఒక అఖిల భారత—కాంగ్రెస్‌ను లేవదీస్తారు!

అందుకే ఆ కిల్లీల కొట్టు అబ్బాయి అట్టా అన్నాడు

బహుశః అందరూ నన్ను చూసి నవ్వుతున్నారు కాబోలు! ఇందాకా ఆ కిల్లీకొట్టు అబ్బాయిఅన్నట్టే అందరూ అంటున్నారు కాబోలు!

నా వ్యాసాలూ, కథలూ చదివిన పాఠక మహాశయులైతేనేమి నా భావాలు వింటున్న స్నేహిత బృంద మయితేనేమి చేసిన ప్రచారంతో యిప్పటికే ఊళ్ళో 95 వంతులూ దేశంలో 90 వంతులూ అపకీర్తి ఉన్నాది. మాబుద్ధిలేని కమీషనర్, బుద్ధిలేని చైర్ మెన్ చేస్తున్న ప్రచారం వలన అధికారవర్గంలో 98పాళ్లు అపకీర్తి ఉన్నాది. యీవేళ యీ రాత్రి సమయంలో యీ అమ్మాయిలు నాతో రావడంసంగతి తెలియగానే యీకొద్దిపాటి మంచి పేరూ పోతుంది. అందరూ అదోమోస్తరుగా నా ప్రక్క చూస్తారు! మొన్నట ఎలక్షన్‌లో "బుద్ధిలేని వాళ్ళకూ, తాగుబోతులకూ చైర్‌మేన్ పదవి ఎందుకూ?" అని అన్నందుకు ఉన్న కోపంవల్ల అయితేనేమి, .మ్యూనిసిపాలిటీ వెనుకనుంచి అధికారం చేతులోపెట్టుకొని బుద్ధిలేకుండా కమిషనర్ చేస్తున్న పైశాచిక కృత్యాలను ప్రకటించినందుకు ఉన్న పగచేత నైతేనేమి—యీ సంగతి గాలిలో వాసనచూసి కాండక్టురూల్సు ప్రకారం నా వుద్యోగం తీసివేస్తారు.

అన్నిటికన్న ముఖ్యం [నాకు ఎవ్వరూ అప్పు ఇవ్వరు? అప్పులమీదనే జీవిస్తున్న మనగతి—?

చాలవూ యీ కష్టాలు . . ?

మేము బ్రిడ్జిదాటి అవతలవేపు చేరాము— అక్కడే దేవాలయం ఉంది:

వాళ్లు అంత ఉత్సాహంగా గాలిమీదతేలిపోతూ నడుస్తుంటే పాపం. వాళ్ళతో యీ సంగతులన్నీ ఎట్లా చెప్పగలను?

ఇప్పుడూ యేమీ చెయ్యలేము కాని, నా అదృష్టం కొద్దీ రోడ్డుమీద ఎవరూలేరు! రెండు మూడు కిళ్లీకొట్లూ, అరటిపండ్ల కొట్లూ మాత్రం బడ్డీదీపం ముందు కునికిపాట్లు పడుతున్నాయి.

అంతవరకూ నా ప్రక్కనే బహుశ; నన్ను పరీక్షచేస్తూకూడా నేమో!—నడుస్తున్న ఆ అమ్మాయిలిద్దరూ ఆలయందగ్గర మలుపు తిరగగానే కొంచెం వెనకపడి నడవటం ప్రారంభించారు. కొద్ది నిముషాలలోనే ఆలయం దగ్గరకు వచ్చాము.

లోపలయెవరో పాడుతున్న "దేమి మీనాక్షి ముదందేహి మేవసతతం'' అన్నపాట గాలిలో తేలుతూ వచ్చి యేదోహాయిని కలిగిస్తున్నాది.

కమాలా, సరోజా ఒక కొట్టుదగ్గర నిలబడి పోయారు. నేనుఆగి వెనుతిరిగి చూశాను, సరోజ చేతికి అరటిపళ్ళ ను యిచ్చి యేదోచెప్పింది. ఆ అమ్మాయి రెండడుగులలో నాదగ్గరకువచ్చి అరటి పండ్లను నాచేతులో పెడుతూ—ఇవి దేవుడికి యిచ్చేమని చెప్పింది అక్కయ్య? అన్నాది.

కమల కుంకుమ కొంటున్నది. ఆమెకుంకుమా ఫలాలూ పట్టుకొని ముందడుగువేసేసరికి అజంతా చిత్రం జ్ఞాపకంవచ్చింది నాకు.

నేను అరటిపండ్ల షాహుకారు దగ్గరకువెళ్లి ఎంతఅయింది అని పర్సు బయటకు తీశాను.

"అమ్మగారుయిచ్చేశారండి డబ్బులు"అనిశెట్టి "అక్కయ్య యిచ్చి వేసిందండీ" అని సరోజా ఒక్కసారి అన్నారు. నేను పర్సు తెరవకుండానే మళ్లీ జేబులో వేసుకున్నాను. నాచేతులో అరటి పండ్లనుచూస్తూ ముందుకు అడుగు వేశాను.

నాలో యే ప్రత్యేకమైన భావంలేదు. విసురు గాలిలోని కాగితం ముక్కలాగ తప్పు పైవిలాసంతో వచ్చిన ఉత్తరాలలాగ, భర్తలను సంపాదించుకోలేక ముసలి అయిపోతున్న కన్యకలలాగ చేతిలోని అరటిపండ్ల స్వరూపం యొక్క అవ్యక్త భావం—అమ్మగారుయిచ్చేశారండీ డబ్బులు అన్న శెట్టిమాటలు 'దేవీ మీనాక్షి' ఆఖరిచరణం ఆఖాళీ స్థలంలో తిరుగుతున్నాయి.

మేము ఆలయం దగ్గరకు రాగానే స్త్రీలద్వారం ప్రక్కకు చెల్లెలినితీసికొని వెళ్తూ కొద్దిగా భయం, కొద్దిగా లజ్జ. కొద్దిగా సిగ్గూ, కొద్దిగా చనువూ, కలిసిన చూపులతో కమల అడిగింది—వేగిరంగా వచ్చేస్తారు కాదూ? అని-

ఈ అమ్మాయి వుద్దేశం తనసేవ చెయ్యటానికే నేను జన్మించానని కాబోలు!

ఆమాట అడగలేక—అలాగే? అని తల వంచుకోని వెళ్ళిపోయాను:

* * *

(యింకా ఉంది)

ఆనందవాణి
పోస్టుబాక్సు నెంబరు
1583
—మేనేజరు